క్లుప్తంగా

చుండూరు మృత వీరుల సంస్మరణ సభ



కూడేరు: మాట్లాడుతున్న నేతలు

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో చుండూరు మృత వీరుల సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. తొలుత బస్టాండ్ నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు ర్యాలీ చేశారు. చుండూరు మృత వీరులకు నివాళుల ర్పించారు. వారు మాట్లాడుతూ అన్ని కులాలు సమానమేనన్నారు. దళితుల పట్ల చిన్న చూపు తగదన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా కోశాధికారి రాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి కిష్టయ్య, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘం సమైఖ్య జిల్లా అధ్యక్షుడు ఏసు రత్నం, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి వీరేంద్ర, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి ఉపేంద్ర పాల్గొన్నారు.

20న నులి పురుగుల దినోత్సవం

వజ్రకరూరు: ఈనెల 20న జరగనున్న నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి తేజస్వి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశా డే సందర్భంగా ఆశాలతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ గర్భిణుల దగ్గర నుంచి పసిపిల్లల వరకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్ నాగశంకర్, ఏఎన్ఎం, ఆశా కా ర్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గుమ్మఘట్ట: అనుమతి లేకుండా కర్ణాటకకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని వేదావతి హగరి నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా అర్ధరాత్రి సమయంలో కర్ణాటకకు ఇసుకను తరలిస్తుండగా కేపీకుంట వద్ద పట్టుకొని, వాటి యజమానులు టీడీపీ నాయకులు పూజారి శివ,పోతులరాజు శివకుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

మలేరియా, డెంగీ ప్రాణాంతకం



వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు: దోమ కాటుతో వ్యాపించే మలేరియా, డెంగీ జ్వరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు అన్నారు. మండలంలోని ఎంఎంహళ్లి ఎస్టీ కాలనీవాసులు జ్వరాలు బారిన పడి ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధ పడేవారు. 'సాక్షి'లో 'ఎంఎంహళ్లిలో విష జ్వరాలు' శీర్షికన మంగళవారం వార్త ప్రచురితమైంది. జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు, మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణలు సిబ్బందితో కలిసి ఎంఎంహళ్లిని సందర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. జ్వరాలు వచ్చినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి, రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్ వైజర్లు నూరుబాషా, రవీంద్ర, శ్రీధర్ మూర్తి, రవి, ఎంఎల్‌హెచ్‌పీలు కరిష్మా, శ్రీవిద్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పైతోట రైతుల నిరసన



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న పైతోట ఏరియా రైతులు

రాయదుర్గంటౌన్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేక పంటలు దెబ్బతింటున్నాయని పట్టణంలోని పైతోట ప్రాంత రైతులు నిరసన తెలియజేశారు. మంగళవారం పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్ద విద్యుత్ శాఖ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. రైతులు ఆంజనేయులు, మారెన్న, నుంకేష్, బొమ్మన్న తదితరులు మాట్లాడారు. దాదాపు వంద మంది దాకా వరి, ఆకుకూరలు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసినట్లు తెలిపారు. అయితే నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేక పంట ఎండుముఖం పట్టినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. స్థానిక వడ్డే కాలనీకి చెందిన వడ్డే గంగాధర్(45)కు భార్య గంగమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవాడు. ఇటీవల అనారోగ్య స మస్యతో బాధపడుతున్న ఆయన కర్నూలులోని ప్రభుత్వాస్పత్రిలో వారం రోజుల పాటు అడ్మిషన్‌లో ఉండి చికిత్స పొందాడు. సోమవారం డిశ్చార్జ్ పొంది ఇంటికి చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం కడుపు నొప్పి తీవ్రతను తాళలేక స్థానిక ధర్మవరంలో రోడ్డులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆశ 'వరి'ంచేనా..?

- ఆయకట్టులో వరి నాట్లలో అన్నదాతల నిమగ్నం
- బోరుబావుల కింద నారు పోసి విక్రయం
- ఆదాయం కోసం భిన్నంగా ఆలోచిస్తున్న రైతులు

బొమ్మనహాళ్: మండలంలోని వేరుశనగ రైతులు ఈ ఏడాది వర్షాభావంతో పంట సాగు చేయలేక, విత్తనాలు విక్రయించలేక, అలానే ఉంచలేక అయోమయ స్థితిలో ఉన్నారు. మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్నారు. తక్కువ సమయంలో డబ్బు సంపాదించే దిశగా ఆలోచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరినారు పోసి, దాన్ని విక్రయిస్తూ, ఆదాయం పొందుతున్నారు.

మండల పరిధిలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, దేవగిరి, దేవగిరి క్రాస్, బండూరు, లింగదహాళ్, కొలగానహళ్లి, గోనేహాళ్, తదితర గ్రామాల్లో కొందరు రైతులు బోరు బావుల కింద తమకున్న పొలాల్లో వరి నారు సిద్ధం చేసి రోడ్డు పక్కనే ఎడ్లబండి, చెట్టు కొమ్మలకు 'ఇచ్చట వరి నారు అమ్మబడును' అని సబంధింత రైతుల పేర్లు, సెల్ నంబర్లను ప్రదర్శనగా ఉంచారు. నారు అవసరమైన వివిధ గ్రామాలకు చెందిన రైతులు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

నారు విక్రయంతోనూ లాభాలు..

నారు విక్రయించడంతో రైతులకు లాభదాయకంగా ఉంటుంది. ప్రస్తుతం నారును సెంటు రూ.1500, రూ. 2 వేల ప్రకారం విక్రయిస్తున్నారు. ఇలా ఎకరాకు రూ. 2.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. ఎకరం పొలంలో సాగు చేయడానికి దాదాపు రూ. లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఇలా నారుతోనే సుమారు రూ.1.5 లక్ష వరకు లాభంగడిస్తున్నారు. బోరుబావుల కింద పొలాన్ని ఖాళీగా ఉంచకుండా, నారు పోసుకొని నాట్లు వేసే సమయానికి నారు విక్రయించి మళ్లీ నాట్లు వేసుకుంటారు. ఇలా రెండు రకాలుగా లాభాలు గడిస్తున్నారు. ఈ సారి తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయిలో నిండడం వల్ల రైతులు వరి సాగుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో భారీగా నారు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇక బోర్లు లేని రైతులకు వర్షా వచ్చిన వెంటనే నారు పోసుకునేందుకు వీలు కాదు.. అలాగే నారు నాటుకునే దశకు రావడానికి సమయం పడుతుంది. దీంతో అదను సమయం దాటే అవకాశం ఉండడంతో చాలా మంది బోర్ల కింద వేసిన నారు కొనుగోలు చేసి వెంటనే నాట్లు వేసుకుంటున్నారు. దీంతో వీరికి అదనపు శ్రమ తప్పడంతో సమయం ఆదా అవుతోంది.



బోరుబావుల కింద సాగు చేసిన వరి నారు

వైభవంగా శ్రావణ మంగళవార పూజలు



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి



ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మొదటి మంగళవారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాతసేవ, పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ప్రత్యేకాలంకరణ, ఆకుపూజలు, తులసీమాలధారణ ,ప్రత్యేక పుష్పాలకరణ నిర్వహించి మహామంగళ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక వాహనాలు, వివిధ డిపోల నుంచి హనుమాన్‌దర్శన్ బస్సులు , ప్రైవేట్ వాహనాల్లో వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఇటు మురడి నుంచి, అటు కసాపురం నుంచి వచ్చిన వాహనాలు నేమకల్లులో కలవడంతో రద్దీ కనిపించింది. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల రాకపోకలు, భక్తుల దర్శనానికి తగిన ఏర్పాట్లు చేశారు. బొమ్మనహాళ్ ఎంపీపీ పద్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి అన్నసంతర్పణ నిర్వహించారు.

వైభవంగా గణపతి హోమం

విడపనకల్లు: మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవారం గణపతి హోమం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్ర స్వామి,భద్రకాళికాదేవికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉపాధి పనుల్లో పాదర్శకత పాటించాలి

- ప్రొసీడింగ్ అధికారి, ఏపీడీ సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో మరింత పారదర్శకత పాటించాలని ప్రొసీడింగ్ అధికారి (ఏపీడీ) సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డీహీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయం వద్ద 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 30 వరకు ఉపాధి పథకం ద్వారా రూ.7 కోట్లు ఖర్చుచేశారు. దీనిపై మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేశాయి. వాటిలో గుర్తించిన లోపాలను బహిరంగ ప్రజావేదికలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేత (ఇన్‌చార్జ్ అంబుడ్స్‌మెన్)గా సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్, తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఉపాధి పథకం ద్వారా రూ.5.50 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా రూ.1.50 కోట్లతో చేపట్టిన పనుల వివరాలపై గ్రామాల వారీగా డీఆర్‌పీలు చదివి వినిపించారు. ఇందులో ఎక్కువ శాతం మస్టర్ల కరెక్షన్, చేసిన పనుల్లో కొలతల వ్యత్యాసం, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడం లాంటివి గుర్తించారు. ఈ నేపథ్యంలో పలు పనులకు సంబంధించి రూ.59 వేలు ఫైన్ వేయగా, రూ.16,814 వేలు రికవరీకి ఆదేశించారు. మొత్తంగా రూ.75 వేలు అక్రమాలు జరిగినట్టు తేల్చారు. ఈ మొత్తంలో కొన్ని పనులకు ఆధారాలు చూపుతామని, వాటికి సడలింపు ఇవ్వాలని కోరారు. సరైన ఆధారాలు చూపేందుకు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ రామకృష్ణ, ఈసీ రవికుమార్, టెక్నికల్, క్షేత్ర సహాయ సిబ్బంది, తనిఖీ బృందం, వివిధ గ్రామాల కూలీలు, రైతులు పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు తాపించాలి



ఉరవకొండలో పౌష్టికాహార కిట్లను అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బొమ్మనహాళ్: తల్లిపాలే చంటి పిల్లలకు శ్రీరామరక్ష అని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యులు గీతాభార్గవి, కుమారరాజా అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో సందర్భంగా శ్రీధరఘట్ట పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ హెడ్యుకేటర్ విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ బాలాజీ, గౌతమి, అలివేలు, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, నాగరత్నమ్మ, ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉరవకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని, అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపించడం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉన్న 21వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వారోత్సవాల్లో 21, 22వ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన గర్భిణులకు పౌష్టికాహార కిట్లను సూపర్‌వైజర్ రాజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నసీమా, షాహెనాజ్ అందించారు.

వజ్రకరూరు: తల్లిపాలే శిశువుకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ ఉదయభాను తదితరులు అన్నారు. మంగళవారం మండలంలోని కొనకొండ్లలోని అంగన్‌వాడీ కేంద్రం-1 పరిధిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి వీధుల గుండా ర్యాలీ చేశారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఏఎన్ఎం పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు,గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కంబదూరు: తల్లిపాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని వైద్యాధికారి ఆసియా తెలిపారు. మంగళవారం మండలంలోని ఒంటారెడ్డిపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేశారు. డాక్టర్ ఆసియా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు పసుపు రంగులో వచ్చే ముర్రుపాలు తాపించడం వల్ల అవి బిడ్డకు దివ్య ఔషధంగా పనిచేస్తాయన్నారు. వైద్య సిబ్బంది భారతి, జ్యోతి, యల్లంరాజు, రమేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలి

ఉరవకొండ: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం 11వ పీఆర్‌సీకి రావాల్సిన బకాయి వెంటనే విడుదల చేసి, 12 పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలన్నారు. రెండోవిడత నాడు-నేడు పనులను వెంటనే పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు సాకేభాస్కర్, నాయకులు నజీర్, నరసింహులు, పాండురంగ, ఓబన్న, చంద్ర, నాగరాజు, రామకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

117 జీఓ రద్దు చేయాలి



విడపనకల్లులో జీఓ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విడపనకల్లు: జీఓ117 ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు విద్యా రంగానికి నష్టం కలిగించేలా 117 జీఓ ఉందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 117జీఓ ఆధారంగా పని దినాలు సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్ట పోతున్నారని, వెంటనే పని సర్దుబాటు నిలిపివేసి నెలవారి పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, సాకే భాస్కర్, ఉరవకొండ, విడపనకల్లు ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు, కార్యర్శులు, పాండురంగ, బీసీ ఓబన్న, తలారి నరసింహులు, కిషోర్, రామకృష్ణ, నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆదినారయణ, భాస్కర్, మల్లేస్, భూమా రామాంజనేయులు, శేఖర్, సోమశేఖర్, రామన్న, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మురడి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీస్ బృందం

రాయదుర్గం (డీ హీరేహాళ్): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా సరే వదిలి పెట్టేదిలేదని కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు హెచ్చరించారు. శ్రావణ మంగళవారం సందర్భంగా మురడి, నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయాల్లో రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మురడిలో డీఎస్పీ మాట్లాడారు.. గ్రామల్లో ప్రజలంతా దాయాదుల్లా కలసి మెలసి ఉండాలన్నారు. ప్రతి చిన్న విషయానికీ ఘర్షణలు పెట్టుకొని, కేసుల్లో ఇరుక్కోవడం మంచిది కాదన్నారు. సరిహద్దు గ్రామాల్లో పోలీస్ నిఘా పెంచామన్నారు. మట్టి, ఇసుక, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శ్రావణమాసం పూర్తయ్యే వరకు ఈ రెండు ఆలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీఎస్పీ వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంలో మోస్తరు వర్షం

రాయదుర్గంటౌన్: పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి మోస్తరు వర్షం పడింది. రాత్రి 7 గంటలకు మొదలైన వర్షం అరగంటకు పైగా కురిసింది. తర్వాత జడివాన పట్టుకుంది. పంటల సాగుకు పదునైన వర్షం కోసం ఎదురుచూస్తుండగా, ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది.

మానసికంగా దృఢంగా ఉంటేనే మెరుగైన ఆరోగ్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

విడపనకల్లు: మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని, ఈ అంశంపై ప్రజలను చైతన్య పరచాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. జాతీయ మానసిక దినోత్సవం సందర్భంగా నోడల్ అధికారి విశ్వనాథ్‌తో కలసి మంగళవారం పాల్తూరులోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మానసిక జబ్బులు, వాటి లక్షణాలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, దోమకాటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ జయకుమార్‌నాయక్, డాక్టర్ అరుణ కుమారి, డాక్టర్ శివశంకర్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి, ఎంపీహెచ్ఓ తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గడేకల్లులో నూతన పీహెచ్‌సీ నిర్మాణం కోసం అనువైన స్థల పరిశీలన చేశారు.

బాధ్యతగా పని చేయాలి



ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్నకుమార్

కంబదూరు: మండలంలోని ఆశా కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని వైద్యాధికారి ప్రసన్నకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తలు గర్భిణులకు అందుబాటులో ఉంటూ, వారికి సకాలంలో వైద్య సేవలను అందించాలన్నారు.స్పర్శలేని మచ్చలు కుష్టివ్యాధి కావొచ్చనని, స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాలన్నారు.

అమ్మయ్యా.. ఆవు ఈనింది!



ఆవు,దూడను చూపుతున్న పశువైద్యాధికారి రమేష్ తదితరులు

బెళుగుప్ప: ఇంటి ఇల్లాలు నెలలు నిండి, పురిటినొప్పులతో బాధపడుతుంటే.. ప్రసవం కష్టమే అని తెలిసినప్పుడు భర్తతోపాటు, కుటుంబ సభ్యులంతా విలవిల్లాడడం సహజమే. అలానే ఆవుకు కూడా నెలలు నిండాయి.. ఈనలేకపోతోంది (ప్రసవ వేదన).. ఆవు యజమాని తిమ్మినేని కిట్టమ్మకు ఏం చేయాలో పాలుపోక తల్లడిల్లిపోయింది. తెలిసిన వారందరికీ ఆవును చూపించి, విషయం చెప్పుకుంది.. తలో మాట చెప్పున్నారేగానీ.. ఎవరూ ఏమి చేయలేని పరిస్థితి. దిక్కుతోచని స్థితిలో యజమాని ఇంటి ఇలవేల్పును వేడుకుంది. చివరకు బెళుగుప్ప పశువైద్యాధికారి రమేష్‌కు సమాచారం అందించింది. పశువైద్య సహాయకులు చంద్ర, ఎర్రిస్వామి, మారుతి, అనిల్, సుధాకర్, విజయ్‌తో కలిసి ఆయన గ్రామానికి వెళ్లి ఆవు పరిస్థితిని తెలుసుకున్నారు. గర్భాశయం మెలికతిరిగిందని, అందుకే ఈత వేయడం కష్టమైందని గ్రహించారు. శాస్త్రీయ పద్ధతులతో కొన్ని గంటల పాటు శ్రమించారు. చివరకు సురక్షితంగా దూడను బయటకు తీశారు. ఊరిజనం రెండు రోజుల ఉత్కంఠకు తెరపడింది. దూడ (కుర్రదూడ)తోపాటు ఆవు కూడా సురక్షితంగా ఉండడంతో యజమాని కిట్టమ్మ, కుటుంబ సభ్యులు పశువైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఘటన మండలంలోని వెంకటాద్రిపల్లిలో మంగళవారం జరిగింది.

ఇసుక డంప్‌ల తనిఖీ

రాయదుర్గం(డి హీరేహాళ్): డీ హీరేహాళ్ మండలంలోని మట్టి, ఇసుక అక్రమ రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపారు. మంగళారం 'సాక్షి'లో ఇసుక దందాపై కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా అధికారులు స్పందించారు. మైన్స్‌అండ్ జియాలజీ అధికారి ప్రసాద్, సెబ్ సీఐ మురళీమోహన్, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. పలు ప్రాంతాల్లో నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి రవాణా చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా గజవాహన సేవ



వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

విడపనకల్లు: మండలంలోని ఉండబండ వీరభద్రస్వామి, బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ఈఓ. రమేష్‌బాబు, అర్చకుల ఆధ్వర్యంలో గజవాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరభద్రస్వామి, కాళికాదేవి ప్రతిమలు ప్రత్యేకంగా పూలతో అలంకరించిన గజవాహనంపై కొలువుదీర్చి, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. గజవాహన సేవ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు తరలి వచ్చారు.

జలచౌర్యానికి పాల్పడితే చర్యలు



పైపులను కట్ చేయిస్తున్న హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి

బొమ్మనహాళ్: ఎగువ కాలువ (హెచ్చెల్సీ) నుంచి ఆయకట్టుకు వచ్చే నీటిని పిల్ల కాలువల ద్వారా జలచౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి అన్నారు. డిస్ట్రిబ్యూటరీ ద్వారా వచ్చే నీటిని నాన్ ఆయకట్టు దారులు పైపులు వేసి జలచౌర్యానికి పాల్పడుతున్నారని గ్రీవెన్స్‌లో కొందరు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం మండలంలోని డిస్ట్రిబ్యూటర్ ద్వారా పిల్ల కాలువకు పైపులు వేసి అక్రమ నీటిని వాడుకుంటున్న పైపులను గుర్తించి ధ్వంసం చేశారు. ఈఈ రమణారెడ్డి మాట్లాడుతూ జలచౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయకట్టుదారులకు ఇబ్బంది కలగకుండా సాగునీటిని అందిస్తామని తెలిపారు.

మూఢనమ్మకాలు ప్రగతికి అవరోధాలు



విద్యార్థులతో అవగాహన కల్పిస్తున్న తరిమెల అమర్నాథ్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: మూఢ నమ్మకాలు దేశ ప్రగతికి అవరోధాలను మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, పీవీఆర్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానవత సంస్థ కో కన్వీనర్ సలాంమాలిక్ పాల్గొని, మాయలు, మంత్రాలు లేవని, సైన్స్ మాత్రమే శాశ్వతమని తెలియజేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచే లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్, బాలికల పాఠశాల హెచ్ఎం జయప్రద, పీవీఆర్ కరస్పాండెంట్ నరేష్ కుమార్‌రెడ్డి, జేవీవీ నాయకులు గౌర సత్యనారాయణ, ఎంజీ వీరణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల చేయూత



వన్నూరుస్వామి తండ్రి తిప్పేస్వామికి నగదు అందిస్తున్న విద్యార్థులు

కణేకల్లు: 'ప్రార్థించే చేతుల కన్నా ... సాయం చేసే చేతులు మిన్న' అని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిరూపించారు. తమ స్నేహితుడు బైక్ యాక్సిడెంట్‌లో తలకు దెబ్బతగిలి తీవ్రంగా గాయపడటంతో అతనికి మెరుగైన చికిత్స చేయించేందుకు చేయిచేయి కలిపారు. రూ.22 వేలు పోగు చేసి విద్యార్థి తండ్రి తిప్పేస్వామికి అందించారు. కణేకల్లు మండలంలోని పూలచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి వన్నూరుస్వామి గత నెల 28న బైక్ యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలింది. దీంతో తలలో రక్తం గడ్డ కట్టింది. అతన్ని చికిత్స నిమిత్తం బళ్లారి, ఆతర్వాత బెంగళూరుకు తీసుకెళ్లారు. వన్నూరుస్వామిది నిరుపేద కుటుంబం కావడంతో తోటి విద్యార్థులు అజిత్, మహేంద్ర, తౌసిఫ్‌లు వన్నూరుస్వామి తదితరులు చేయూతనందించారు.